క్లుప్తంగా

ఘనంగా శివాజీ జయంతి



సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట, సంగెం, దుగ్గొండి, నల్లబెల్లి, తదితర మండలాల్లో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు బుధవారం నిర్వహించారు. శివాజీ చిత్రపటాలకు నివాళులర్పించారు. నర్సంపేట, వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రాల్లో విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్, ఏబీవీపీ, ఛత్రపతి శివాజీ యువదళ్ సంయుక్త ఆధ్వర్యంలో శివాజీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సంగెంలో యువజన నాయకులు వృద్ధులు, పేదలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో విశ్వహిందూ పరిషత్ జిల్లా సహాయ కార్యదర్శి మల్యాల రవి, అరె సంఘం జిల్లా అధ్యక్షుడు ఇంగ్లే శివాజీ, నాయకులు వడ్లకొండ మణిదీప్, ఎనగందుల శ్రావన్, గద్దల గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం



నర్సంపేట : పట్టణంలోని శ్రీ ధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో ఆలయ సేవా చారిట్రబుల్ ట్రస్ట్ చైర్మన్ శింగిరికొండ మాధవ శంకర్ గుప్తా ఆధ్వర్యంలో శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ అరో వార్షికోత్సవ వేడుక బుధవారం నిర్వహించారు. అర్చకులు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ దాత బొద్దు దివాకర్‌రెడ్డి, నిశాంత్ శర్మ, అవదాని సతీష్ తివారి, శివ, అంకిత్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



గీసుకొండ : ఆరోగ్యశ్రీ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్‌గా నియమితులైన డాక్టర్ నిఖిల్ స్వరూప్‌ను డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ట్రస్ట్ యూనియన్ సభ్యుడు, జిల్లా మేనేజర్ విక్రం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. తొలుత నిఖిల్ స్వరూప్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ యూనియన్ స్టేట్ జనరల్ సెక్రటరీ మామిడిపల్లి కుమార్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు నల్లబెల్లి అనిల్, కోశాధికారి రాము, సంయుక్త కార్యదర్శి రజిత, చక్రపాణి, స్వాతి, ఆరోగ్యమిత్రలు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం



వర్ధన్నపేట : మండలంలోని రాంధన్‌తండా శివారులో ఆకేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సైలు చందర్, రాజు తెలిపారు. ఇసుక తరలిస్తున్నట్టు సమాచారం అందడంతో ఆకేరు వాగులో అక్రమంగా ఇసుక లోడ్ చేసుకున్న మూడు ట్రాక్టర్లు, ఇసుక లోడుకు సిద్ధంగా ఉన్న నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేసినట్టు ఎస్సైలు చెప్పారు ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేలా నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించడంతోపాటు ఉప్పరపల్లి క్రాస్ వద్ద చెక్ పోస్టు ఏర్పాటు చేసినట్టు వివరించారు.

వృద్ధుడి శవం లభ్యం



మల్లయ్య (ఫైల్)

వర్ధన్నపేట : ఇటీవల అదృశ్యమైన మండలంలోని ఇల్లందకు చెందిన బండి మల్లయ్య (60) శవం బొక్కలగూడెం చెరువులో బుధవారం లభ్యమైంది. గ్రామస్తులు శవాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు.

పరామర్శ

నర్సంపేట : బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమను, జిల్లా ప్రధాన కార్యదర్శి రాణాప్రతాప్‌రెడ్డిని వారి తల్లి జయశ్రీ ఇటీవల మృతి చెందిన క్రమంలో మాజీ రాజ్యసభ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు బుధవారం పరామర్శించారు.

కొలన్‌పల్లిలో..

రాయపర్తి : మండలంలోని కొలన్‌పల్లికి చెందిన వంగాల యాకమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు పరామర్శించారు. ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సోమనాథ ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణమాచార్యులు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

‘ఎంపీటీసీ’లను పెంచండి మహాప్రభో

- గురిజాల, ఇటుకాలపల్లి స్థానాలను విభజించాలని వినతులు
- సర్దుబాటు జీఓపై విమర్శలు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలో ఎంపీటీసీ స్థానాలను పెంచాలన్న డిమాండ్ జోరందుకుంది. ఈ మేరకు గురిజాల, ఇటుకాలపల్లి స్థానాలను విభజించి కొత్తగా మరో రెండు ఎంపీటీసీలు ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు అధికారులకు పలుమార్లు వినతులు అందజేశారు. ఇదిలా ఉండగా ప్రభుత్వం పెరిగిన ఓటర్లను సర్దుబాటు చేస్తూ జారీ చేసిన జీఓపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జనాభా దామాషా మేరకు పెంచకపోవడంపై అసహనం వ్యక్తం అవుతోంది.

నర్సంపేట మండలంలో జనాభా దామాషా మేరకు ఎంపీటీసీ స్థానాలు పెంచాల్సి ఉండగా అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. అది అలా ఉండగా ఇటీవల మున్సిపాలిటీలో రెవెన్యూ గ్రామాలు కలవడంతో ఓటర్ల శాతం పెరిగింది. నర్సంపేట మండలంలో 2019 స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా మొత్తం 11 ఎంపీటీసీలున్నాయి. ఇటీవల నర్సంపేట మున్సిపాలిటీలో నాలుగు ఎంపీటీసీల పరిధిలోని 8 గ్రామాలను విలీనం చేయగా ఎంపీటీసీలను 7కు కుదించారు. కాగా ముత్తోజిపేట ఎంపీటీసీ పరిధిలోని ఇప్పల్‌తండాను సమీపంలోని ఇటుకాలపల్లి ఎంపీటీసీలో విలీనం చేశారు. అలాగే ముగ్దుంపురం ఎంపీటీసీ పరిధిలోని పాత ముగ్దుంపురంను గురిజాల ఎంపీటీసీలో కలిపారు. దీంతో



ఇటుకాలపల్లి గ్రామపంచాయతీ భవనం

గ్రామాల్లో జనాభా పెరగడంతో గురిజాల, ఇటుకాలపల్లి ఎంపీటీసీలను విభజించాలన్న డిమాండ్ నెలకొంది. ఈ మేరకు ప్రజలు, పలు రాజకీయ పార్టీల నాయకులు పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. రాజకీయ పార్టీల నాయకులతో జరిగిన సమావేశాల్లోనూ అధికారులకు లిఖితపూర్వకంగా విజ్ఞాపన పత్రాలు ఇచ్చారు. అయినా ఎంపీటీసీలను పెంచకుండానే ఉన్న వాటితో సర్దుబాటు చేస్తూ జీఓ విడుదల చేశారు.

2500–3500 ఓటర్లకు ఒక ఎంపీటీసీ

ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఒక ఎంపీటీసీకి 2500–3500 జనాభా ఉండాలి. సదరు ఎంపీటీసీ గ్రామాల దూరం ఆధారంగా జనాభాను, ఓటర్లను తగ్గించడం రివాజు. ఇదిలా ఉండగా 2019 ఎన్నికల్లో నర్సంపేట మండలంలోని గురిజాల ఎంపీటీసీ పరిధిలో గురిజాల, జీజీఆర్‌పల్లి, చిన్నగురిజాల, గుంటూరుపల్లి గ్రామాలున్నాయి. కాగా ముగ్దుంపురం నర్సంపేట మున్సిపాలిటీలో విలీనం కావడంతో ఆ గ్రామ రెవెన్యూ కింద ఉన్న పాత ముగ్దుంపురంను గురిజాల ఎంపీటీసీలో సర్దుబాటు చేశారు.

ప్రభుత్వానికి నివేదికలు పంపించాం



నర్సంపేట మండలంలోని గురిజాల, ఇటుకాలపల్లి పరిధిలో పెరిగిన జనాభా ఆధారంగా ఎంపీటీసీలను పెంచాలని కోరుతూ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజల నుంచి వచ్చిన వినతులపై ప్రభుత్వానికి నివేదికలు పంపించాం. కొత్తగా ఎంపీటీసీలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి రాలేదు. ప్రస్తుత ఎంపీటీసీల పరిధిలోనే జనాభా, ఓటర్లను సర్దుబాటు చేస్తూ జీఓ వచ్చింది.

– శ్రీనివాసరావు, ఎంపీడీఓ, నర్సంపేట

దీంతో గురిజాల పరిధిలో జనాభా 7058కి, ఓటర్లు 6151కి చేరిన పరిస్థితి నెలకొంది. అలాగే ఇటుకాలపల్లి ఎంపీటీసీ పరిధిలో ఇటుకాలపల్లి, ఆకులతండా, ఏనుగల్‌తండా గ్రామాలుండగా ముత్తోజిపేటను ఇటీవల మున్సిపాలిటీలో విలీనం చేయడంతో ఆ గ్రామ పరిధిలోని ఇప్పల్‌తండా కలిసి ఇటుకాలపల్లి జనాభా 5747కు, ఓటర్ల సంఖ్య 5019కి చేరింది. ప్రభుత్వ నిబంధనల మేరకు ఈ రెండు ఎంపీటీసీలను విభజించి మరో రెండు స్థానాలను పెంచే అవకాశం ఉంది. తద్వారా గ్రామస్థాయిలో మరింత అభివృద్ధి జరిగే అవకాశం ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి. ప్రభుత్వం స్పందించి మరో రెండు ఎంపీటీసీలను పెంచాలని ప్రజలు, నాయకులు కోరుతున్నారు.

విధి నిర్వహణలో చిత్తశుద్ధి కీలకం

- డీఆర్‌డీఓ కౌసల్యాదేవి

నల్లబెల్లి : విధి నిర్వహణలో చిత్తశుద్ధి కీలకమని డీఆర్‌డీఓ కౌసల్యాదేవి అన్నారు. సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో పారదర్శకంగా వివరాలు సేకరించాలని ఆమె చెప్పారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 16వ విడత సామాజిక తనిఖీ ఇన్‌హౌజ్ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈజీఎస్ కింద 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు మండలంలో చేపట్టిన పనులపై అధికారులు తనిఖీ చేపట్టగా వాటిపై డీఆర్డీఓ సమీక్షించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు కూలీలకు ఎందుకు పనులు కల్పించడం లేదని ఏపీఓ వెంకట్‌నారాయణతోపాటు ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లపై అసహనం వ్యక్తం చేశారు. వలసలను నివారించేలా గ్రామాల్లో కూలీలకు వెంటనే పనులు కల్పించాలని ఆదేశించారు. వర్షపు నీటిని నిల్వ చేసేలా అవసరమైన పనులు చేపట్టాలని, ఎండిపోయిన చెట్ల స్థానంలో మొక్కలు నాటి సంరక్షించేలా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ నర్సింహారెడ్డికి దిశానిర్దేశం చేశారు. కూలీల హాజరులో వ్యత్యాసాలు, ఇతర కారణాలతో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బంది నుంచి రూ.17,890 రికవరికి ఆదేశించారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి మాధవి, క్లస్టర్ టీం అధికారులు సురేశ్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందితో సమీక్షిస్తున్న డీఆర్‌డీఓ కౌసల్యాదేవి

కాల్వను పరిశీలించి నివేదిక ఇవ్వండి

- ఎంపీడీఓకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు

సాక్షి ఎఫెక్ట్..

సంగెం : దేవాదుల ఎత్తిపోతల కాల్వలను సత్వరమే ప్రత్యక్షంగా పరిశీలించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించి తనకు నివేదిక ఇవ్వాలని ఎంపీడీఓ రవీందర్‌ను కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. సంగెం, వర్ధన్నపేట, ఖిలావరంగల్ మండలాల్లోని పలు గ్రామాలకు దేవాదుల ఎత్తిపోతల నీరు అందకుండా ఐనవోలు మండలంలోని కొందరు రైతులు షట్టర్లకు సిమెంట్ వేయడంతోపాటు కాల్వలో మట్టి పోవడం వంటి దుశ్చర్యలకు పాల్పడడంతోపాటు కాల్వలోని ముళ్లపొదలు, చెట్లతో పంటలు ఎండిపోతుండడాన్ని ‘అయ్యో దేవా.. గోడు ఆలకించేదెవరు?’ శీర్షికతో ఈనెల 16న ‘సాక్షి’ ప్రచురించిన కథనానికి జిల్లా కలెక్టర్ స్పందించారు. తక్షణమే కాల్వలో అడ్డుగా ఉన్న అన్నిటినీ తొలగించి నీరు అందేలా చూడాలని ఆదేశించారు. దీంతో ఎంపీడీఓ రవీందర్, వర్ధన్నపేట ఐబీ ఏఈ రాజు రైతు లింగాల నవీన్‌రెడ్డితో కలిసి దేవాదుల సౌత్ మెయిన్ కెనాల్‌ను బుధవారం సందర్శించారు. ఐనవోలు మండలంలోని ఒంటిమామిడిపల్లి వద్ద డీబీ–8ను పరిశీలించగా క్రాస్ రెగ్యులేటర్ షట్టర్ కిందకు దింపి వెల్డింగ్ చేయగా దాన్ని కొందరు సంగెం రైతులు ఇటీవల తొలగించిన విషయాన్ని గుర్తించారు. మళ్లీ సంగెం మండలానికి నీరు రాకుండా కొందరు ఐనవోలు రైతులు తాటికమ్మలు, తదితరాలు వేసి అడ్డుకుంటుండడాన్ని నిర్ధారించారు. అధికారులు 5.3 కిలోమీటర్ల దూరం కాల్వను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రవీందర్ మాట్లాడారు. సింగారం నుంచి 14 కిలోమీటర్ల దూరంలోని సంగెం మండలానికి సాగునీరు అందకుండా అక్కడి రైతులు చేస్తున్న దుశ్చర్యలపై కలెక్టర్‌కు నివేదిక ఇస్తామన్నారు.



కాల్వను పరిశీలిస్తున్న ఎంపీడీఓ, తదితరులు

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



హెచ్‌ఎం, డిప్యూటీ వార్డెన్, ఉపాధ్యాయులతో విద్యార్థినులు

నల్లబెల్లి : మండలంలోని మూడుచెక్కలపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో బుధవారం విద్యార్థులే అధికారులు, ఉపాధ్యాయులై అలరించారు. స్కూల్‌లో నిర్వహించిన స్వయం పరిపాలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులను మరిపించేలా తరగతులు బోధించి ఆకట్టుకున్నారు. జిల్లా కలెక్టర్‌గా రచన, ఐటీడీఏ పీఓగా అక్షయ, డీటీడీఓగా కల్యాణి, డీఈఓగా సంధ్య, హెచ్‌ఎంగా పూజ, స్పోర్ట్స్ ఆఫీసర్‌గా రాజేశ్వరి వ్యవహరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీనివాస్ మాట్లాడారు. సమాజంలో ఉపాధ్యాయ వృత్తి అత్యున్నతమైనదని చెప్పారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు కీలకమని చెప్పారు. ఉపాధ్యాయుల, అధికారుల విధులపై విద్యార్థులకు అవగాహన కల్పించి చైతన్యవంతం చేసేలా స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు ఉన్నతులుగా ఎదిగే దిశగా ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు కార్యక్రమంలో డిప్యూటీ వార్డెన్ వీరమ్మ, ఫిజికల్ డైరెక్టర్ దేవీలాల్, తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు సీఈఓకు ఫిర్యాదు



పర్వతగిరి : మండలంలోని అన్నారం దర్గాలో చోటు చేసుకున్న తలవెంట్రుకల అవినీతిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వక్ఫ్‌బోర్డు సీఈఓకు స్థానిక నాయకుడు జడల కృష్ణ, మాజీ ఎంపీటీసీ భిక్షానాయక్ బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మీడియాకు వివరాలు వెల్లడించారు. రెండేళ్లుగా పోగు చేసిన తలవెంట్రుకలను అక్రమంగా విక్రయించి సుమారు రూ.50 లక్షల మేరకు బోర్డుకు నష్టం కలిగించారని సీఈఓకు వివరించినట్లు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ రియాజ్‌తోపాటు అన్నారం గ్రామానికి చెందిన క్షురకుడు అవినీతి సొమ్ములో వాటాలు పంచుకున్న విషయాన్ని సీఈఓ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. సమగ్ర విచారణ చేపట్టి అవినీతికి పాల్పడిన వారిపై డిమాండ్ చేశామన్నారు.

ప్రశాంతంగా పరీక్షలు రాయండి

- ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ మాధవరావు

సంగెం : విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కాక మాధవరావు సూచించారు. ఆ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు బుధవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. విద్యార్థులు భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎస్సై నరేశ్ మాట్లాడుతూ పరీక్షల పట్ల భయాందోళన అవసరం లేదన్నారు. సంకల్పంతో పరీక్షలు రాస్తే మెరుగైన ఫలితాలు రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ రాము, అధ్యాపకులు విజయనిర్మల, బుచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మాధవరావు

‘ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించండి’



సమావేశంలో మాట్లాడుతున్న సుందర్‌రాజ్

నర్సంపేట రూరల్ : వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థి సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ కోరారు. నర్సంపేట మండలంలో బీసీ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో సుందర్‌రాజ్ మాట్లాడారు. తనను గెలిపిస్తే విద్యార్థులకు, యువతకు, అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బుట్టి శ్యాం యాదవ్, బీసీ పవర్ రాష్ట్ర అధ్యక్షుడు ఆబోతు రాజు, జిల్లా అధ్యక్షుడు సోల్తి సారయ్య, నియోజకవర్గ అధ్యక్షుడు ద్యాగల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు జీజుల సాగర్, నాయకులు బండి విజయ, మంజ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో గుప్పుమంటున్న గుడుంబా

- బానిసగా మారుతున్న యువత, వృద్ధులు
- మామూళ్ల మత్తులో అధికారుల నిర్లక్ష్యం..!

సంగెం : మండలంలో గుడుంబా గుప్పుమంటోంది. నిర్మూలించామన్న అధికారుల ప్రకటనలో ఆచరణలో సాధ్యం కావడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అన్ని గ్రామాలు, తండాల్లోనూ గుడుంబా దొరకని వాడల్లేవంటే అతిశయోక్తి కాదు. వరంగల్ నగరానికి అతి సమీపంలో ఉండడంతో గుడుంబా తయారీ, విక్రయాలు జోరుగా సాగుతున్నట్టు తెలుస్తోంది. మామూళ్ల మత్తులో కొందరు ఎక్సైజ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు వ్యాఖ్యలు వినవస్తున్నాయి. మండలంలో తయారు చేసిన గుడుంబాను సులభంగా వరంగల్ నగరానికి చేరవేస్తూ కొందరు సొమ్ము చేసుకుంటున్నారని సమాచారం. అప్పుడప్పుడు నామమాత్రంగా దాడులు నిర్వహిస్తు భారీగా గుడుంబా, పానకం,



నల్లబెల్లం, పటిక దొరికినా రికార్డుల్లో తక్కువగా లభించినట్టు, నిందితులు దొరికినా పారిపోయారని పేర్కొంటూ అధికారులు చేతులు దుపుకుంటున్నారని తెలుస్తోంది.

యుక్తవయసులోనే వృద్ధాప్యం

పలు గ్రామాల్లో గుడుంబాకు బానిసలైన యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఇంట్లో ఉన్న నిత్యావసర సరుకులు, వస్తువులు సైతం విక్రయిస్తూ గుడుంబా సేవిస్తున్నారని బాధిత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఆరోగ్యం క్షీణించి మండలంలో పలువురు మృత్యువాత పడ్డారు. ఈ క్రమంలో 20 ఏళ్ల ప్రాయంలోనే భర్తలను కోల్పోయి పలువురు మహిళలు వితంతువులుగా మారుతున్నారు. మండలంలో మొత్తం 7695 మంది పింఛన్లు తీసుకుంటుండగా వారిలో 2516 మంది వితంతువులు కాగా వారిలో 80 శాతం మంది యుక్తవయస్సులో భర్తలను కోల్పోయిన వారే. బాధిత కుటుంబాలు వీధిన పడుతుండడం కనపడుతోంది. ఇకనైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి మండలంలో గుడుంబా తయారీ, విక్రయాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ క్రమంలో వివరణ కోసం ఫోన్‌లో ప్రయత్నించగా ఎక్సైజ్ సీఐ స్వరూప, ఎస్సై సరిత అందుబాటులోకి రాలేదు.

తెలంగాణ ఉద్యమకారులపై నిర్లక్ష్యం తగదు

- ఫోరం మండల అధ్యక్షుడు అన్వర్

వర్ధన్నపేట : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నిద్రాహారాలు మానుకుని ఉద్యమించిన వారిని రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు అన్వర్ అన్నారు. ఫోరం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు న్నికల సందర్భంగా పట్టణంలో బుధవారం పోస్టు కార్డు ఉద్యమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టు కార్డులు పంపించారు. కార్యక్రమంలో ఫోరమ్ నాయకులు వేణు, బొజ్జ ప్రభాకర్, నూనె అశోక్, వన్నాల శ్రీను, గోధుమల మధు, కంజర్ల మహేశ్, తిరుపతి, సురేశ్, చెన్నయ్య, లక్ష్మణ్, సాయన్న, శ్రీధర్‌రావు, షబ్బీర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



కార్డులు పోస్ట్ చేస్తున్న అన్వర్, తదితరులు

ఇంటర్నల్ మార్కుల పరిశీలన



చెన్నారావుపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ, సిద్దార్థ హైస్కూళ్లలో అధికారులు మానుపాటి పాపమ్మ, బోయినపల్లి ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలోని సభ్యులు పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల రికార్డులను సబ్జెక్టుల వారీగా బుధవారం పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వెరిఫికేషన్ టీం సభ్యులు రవి, సంతోశ్‌కుమార్, కృష్ణమూర్తి, యాకయ్య, వేముల కిశోర్, రజని, రవీందర్, హెచ్‌ఎం అండెం కరుణాకర్‌రెడ్డి, సీఆర్‌పీ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’తో పేదలకు లబ్ధి

- ప్రోగ్రాం మేనేజర్ రామ్మూర్తి

చెన్నారావుపేట : కంటి వెలుగు వైద్యశిబిరంతో పేదలకు లబ్ధి చేకూరుతుందని ప్రగతి స్వచ్ఛంద సేవా సంస్థ ప్రోగ్రాం మేనేజర్ రామ్మూర్తి తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన శంకర కంటి ఆస్పత్రి, ప్రగతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన కంటి వైద్యశిబిరాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యురాలు సరోజ ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్మూర్తి మాట్లాడారు. వివిధ గ్రామాల నుంచి 121 మంది శిబిరానికి వచ్చి వైద్యపరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. వారిలో 62 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించామని, హైదరాబాద్‌కు ఉచితంగా తీసుకెళ్లి సర్జరీ చేయిస్తామని చెప్పారు. డాక్టర్ సరోజ మాట్లాడుతూ కంటిని పరిరక్షించుకునే దిశగా వైద్యశిబిరాలను వినియోగించుకోవాలని కోరారు. వృద్ధులకు పరీక్షలు చేయించడంలో నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేశ్‌రెడ్డి, నర్సంపేట కోఆర్డినేటర్ పాలడుగుల శివ, నెక్కొండ కోఆర్డినేటర్ కొమ్మాలు, రిజినల్ కోఆర్డినేటర్ చేడుపాక వెంకన్న, బరిగెల రాజ్‌కుమార్, డాక్టర్ బాలరాజు, స్వప్న, శైలజ, నస్రిమ్ తదితరులు పాల్గొన్నారు.



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ సరోజ

కేంద్ర బడ్జెట్‌తో ప్రయోజనాలు శూన్యం



గీసుకొండ : ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఎంసీపీఐ(యూ) నాయకులు

- జిల్లావ్యాప్తంగా వామపక్షాల నిరసన

సాక్షి నెట్‌వర్క్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో ప్రజాప్రయోజనాలు శూన్యమని సీపీఎం, ఎంసీపీఐ(యూ) నాయకులు ఆందోళన వెలిబుచ్చారు. ఆయా పార్టీల ఆధ్వర్యంలో జిల్లాలోని నర్సంపేట, దుగ్గొండి, సంగెం, గీసుకొండ మండలాల్లో బుధవారం నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. గీసుకొండలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఈసంపెల్లి బాబు, జిల్లా నాయకుడు కోరబోయిన కుమారస్వామి, ఎంసీపీఐ(యూ) నాయకులు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌ను ఎండగట్టారు. కేంద్ర ప్రభుత్వం పేదల, కార్మికుల సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చేలా వ్యవహరించిందని విమర్శించారు.

బాలికలు లక్ష్యాన్ని చేరుకోవాలి

గీసుకొండ : బాలికలు ప్రేమ, తదితర అంశాల పట్ల చైతన్యవంతులై చదువులో రాణిస్తూ లక్ష్యాన్ని చేరుకోవాలని జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ వసుధ చెప్పారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం, జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో మండలంలోని వంచనగిరి కేజీబీవీలో బాలల హక్కులపై బుధవారం ఏర్పాటు చేసిన సదస్సులో ఆమె మాట్లాడారు. కిశోర దశలో వచ్చే మార్పులను అర్థం చేసుకుని బాలికలు లక్ష్యం వైపు దూసుకెళ్లాలన్నారు. ఈ దశలో చాలామంది ప్రేమ పేరుతో మోసపోయి జీవితంలో కోలుకోలేని పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. బాలల సంక్షేమ సమితి సభ్యుడు ఆకులపల్లి మధు మాట్లాడుతూ జీవితంలో ఎదురయ్యే సమస్యలు, సవాళ్లను ఎదుర్కోవడానికి జీవన నైపుణ్యాలను అలవర్చుకోవాలన్నారు. కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ హిమబిందు, జిల్లా బాలల సంరక్షణ విభాగం ప్రతినిధి మంద ప్రణయ్‌కుమార్, 1098 సిబ్బంది ధరావత్ మౌనిక, జెండర్ స్పెషలిస్ట్ హర్షిత, ఉమెన్ హబ్ సిబ్బంది, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.